సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 29 । మార్చి । 2024



ఎల్లంపల్లి నీటిలో పూజలు

వేములవాడరూరల్: మండలంలోని నమిలి గుండుపల్లికి చేరుకున్న ఎల్లంపల్లి నీటికి విప్ ఆది శ్రీనివాస్ గురువారం పూజలు చేశారు.

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ శుక్ర(సా॥)	సహర్ శని(ఉ॥)
కరీంనగర్	:	6.27	4.45
పెద్దపల్లి	:	6.34	4.50
రాజన్న సిరిసిల్ల	:	6.34	4.51
జగిత్యాల	:	6.34	4.50

గరిష్ఠం/కనిష్ఠం
39.0/27.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వస్త్రపరిశ్రమను ఆదుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్
- సిరిసిల్లలో వంటావార్పుతో నిరసన



సిరిసిల్లటౌన్: వస్త్రపరిశ్రమపై ఆధారపడిన వారికి ప్రభుత్వం వెంటనే ఉపాధి కల్పించాలని తెలంగాణ పవర్‌లూమ్‌వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ కోరారు. సిరిసిల్లలోని చేనేత జౌళిశాఖ ఆఫీస్ ఎదుట గురువారం కార్మికులు, ఆసాములతో కలిసి వంటావార్పుతో నిరసన చేపట్టి మాట్లాడారు. వస్త్రపరిశ్రమ మూడు నెలలుగా సంక్షోభంతో పనుల్లేక నేతన్నలు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి సమస్యను పలు దఫాలుగా ప్రభుత్వం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వస్త్రపరిశ్రమ సంక్షోభం నివారణకు కార్మికులకు ఉపాధి కోసం పరిశ్రమ అనుబంధాల సంఘాల ఐక్య పోరాట కార్యాచరణ రూపొందించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, ఎలిగేటి రాజశేఖర్, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, ఒగ్గు గణేష్, కుమ్మరికుంట కిషన్, సబ్బని చంద్రకాంత్, సదానందం, సురేష్, వేణు, రాజు, రవీందర్, సంపత్, సతీష్, పోచమల్లు పాల్గొన్నారు.

జిల్లాలో ఆరుగురు కుష్ఠు రోగులు

- డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: జిల్లాలో కొత్తగా ఆరుగురు కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. జాతీయ కుష్ఠు నివారణలో భాగంగా ఈనెల 11 నుంచి 24 వరకు జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ లెప్రసీ కేస్ డిటెక్షన్ కమైన్స్(ఎల్‌సీడీసీ) పూర్తయిన సందర్భంగా గురువారం వివరాలు వెల్లడించారు. జిల్లాలోని 1,28,936 ఇళ్లను వైద్యసిబ్బంది సందర్శించి 2,119 మంది అనుమానితులను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో ఆరుగురు కుష్ఠు వ్యాధిగ్రస్తులుగా తేల్చి వారికి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చర్మంపై 1 నుంచి 5 మచ్చలు ఉంటే దానికి ప్యాసిబాసిల్లరి చికిత్సను ఆరు నెలలు మందులు వాడాల్సి ఉంటుందని తెలిపారు. 5 కన్నా ఎక్కువ మచ్చలు ఉండి నరాలు నొప్పిగా ఉంటే దానిని మల్టీబాసిల్లరీగా గుర్తించి 12 నెలలు చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఎల్‌సీడీసీని విజయవంతం చేసిన ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజిత, డీపీఎంవో చేపూరి శ్రీనివాస్, హెచ్‌ఈ బాలయ్యలను అభినందించారు.

స్థానిక కూలీలకు ఉపాధి కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు



సిరిసిల్లటౌన్: ఇతర రాష్ట్రాల కూలీలు ఇక్కడికి రావడంతో స్థానికులు ఉపాధి కోల్పోతున్నారని, స్థానికులకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు కోరారు. సిరిసిల్ల లేబర్‌అడ్డాలో గురువారం స్థానిక కూలీలతో కలిసి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల కూలీలు తక్కువ రేట్లకే పనికి వెళ్లడంతో స్థానిక కార్మికులకు పనుల్లేకుండా ఉంటున్నారన్నారు. సిరిసిల్లలోని లేబర్ అడ్డాలో కూలీల కోసం విశ్రాంతి గదులు నిర్మించాలని, హెల్త్‌కార్డులు అందించాలని కోరారు. రాజేందర్, మల్లయ్య, దేవరాజు, వెంకటేశ్ తదితరులున్నారు.

బ్రాహ్మణ సమాజాన్ని గౌరవించాలి



సిరిసిల్లటౌన్: బ్రాహ్మణ సమాజాన్ని రాజకీయ పార్టీలు గౌరవించి ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలని ఆ సామాజిక వర్గం రాష్ట్ర అధికార ప్రతినిధి రాచర్ల పార్థసారథి కోరారు. గురువారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కటుకం మృత్యుంజయంకు ఇవ్వాలని కోరారు. బీజేపీ హైదరాబాద్‌లో ఒక సీటు ఇచ్చిందన్నారు. బుగ్గ కృష్ణయ్య, పంచరత్నాల మురళి, యాదగిరి శర్మ, శివకుమార్ శర్మ పాల్గొన్నారు.

కల్యాణం ..కమనీయం

- వైభవంగా ఆదిదేవుని కల్యాణోత్సవం
- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన అధికారులు
- లక్ష మందికిపైగా హాజరు
- రేపు రథోత్సవం



రాజన్నను వివాహమాడుతున్న జోగినులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



మంగళసూత్రం చూపుతున్న ప్రధాన అర్చకుడు



కన్యాదాతలుగా వ్యవహరిస్తున్న దంపతులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం 10.50 గంటలకు ఆలయ చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వేదమూర్తుల మంత్రోచ్ఛరణల మధ్య, భాజాభజంత్రీలతో కల్యాణం వైభవంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం పెద్దసేవపై ఊరేగించారు. దాదాపు లక్ష మంది వరకు హాజరయ్యారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు. కన్యాదాతలుగా అప్పాల భీమాశంకరశర్మ–ఇందిర దంపతులు, వ్యాఖ్యాతగా చంద్రగిరి శరత్ వ్యవహరించారు. భక్తుల ద్వారా రూ.78 వేల కట్నాలు వచ్చినట్లు అకౌంట్స్ అధికారులు తెలిపారు. ఈనెల 30న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఆలయంలో ఖడ్గాలు వేస్తున్న వీరశైవులు



కల్యాణానికి హాజరైన హిజ్రాలు



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మున్సిపల్, ఆలయ అధికారులు



నెమలివాహనంపై స్వామివారు

కాల్ రికార్డ్స్ ఖతం!

సిరిసిల్ల హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం

- జిల్లా కేంద్రంగా వార్ రూంను గుర్తించిన పోలీసులు
- స్థానిక నేత ఇచ్చిన నంబర్లు ఇక్కడి నుంచే ట్యాప్
- 12న డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్టు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బాధితులు?
- వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నేతలు, సీఎం అనుచరులే..



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇది హైదరాబాద్‌లోని ఎస్‌ఐబీ కార్యాలయం కేంద్రంగా సాగగా సిరిసిల్ల, వరంగల్‌లో ఎస్‌ఐబీ పోలీసులు కొందరు వార్ రూంలు ఏర్పాటు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. వరంగల్‌లో ఓ నాయకుడు చెప్పిన నంబర్లు ట్యాప్ చేసినట్లుగా ఆరోపణలు వస్తుండగా అదే తరహాలో సిరిసిల్లలోనూ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సిరిసిల్లకు చెందిన ఓ కీలక నేత కూడా కొన్ని నంబర్లు ఇచ్చి, స్థానిక వార్ రూం ద్వారా పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు నిర్ధారించారు. పంజగుట్ట పోలీసుల విచారణలో ఆ నాయకుడు ఎవరు? ట్యాప్ చేయమని ఎవరెవరి నంబర్లు ఇచ్చాడు? వార్ రూం ఎక్కడ నుంచి నిర్వహించారు? అందులో ఎవరెవరు పని చేశారు? తదితర అంశాలపై విచారణ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ట్యాప్ అయిన జాబితాలోని మెజారిటీ వ్యక్తులు కాంగ్రెస్ సీనియర్లు, అందులోనూ సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితులు కావడం గమనార్హం.

వార్ రూం ఎంతకాలం నడిచిందో?

గత డిసెంబర్ 4న ఎన్నికల ఫలితాలతో అప్రమత్తమైన అప్పటి సిరిసిల్ల డీఎస్పీ ప్రణీత్‌రావు సీసీ కెమెరాలు ఆపేసి, వార్ రూంలోని దాదాపు 50 హార్డ్ డిస్కులను ధ్వంసం చేసిన విషయం విదితమే. దీనిపై మార్చి 10న పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదవడం, 12న డీఎస్పీని సిరిసిల్లలో అరెస్టు చేయడం చకచకా జరిగిపోయాయి. ప్రణీత్‌రావు, ఆయన బృందం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంగానే వార్ రూం ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అది ఎంతకాలం నడిచింది? ఎవరెవరి కాల్స్ రికార్డ్ చేశారు? అన్న విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. వార్ రూం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్ల ద్వారా వివరాలు సేకరించినట్లు తెలిసింది. వీరు ట్యాప్ చేసిన కాల్స్‌లో ముఖ్యమైన వాటిని కాపీ చేసి, ప్రణీత్‌రావుకు ఇచ్చేవారని సమాచారం. ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన హార్డ్ డిస్కుల్లో సిరిసిల్ల కాల్ రికార్డ్స్ కూడా ఉన్నాయని సమాచారం.

సిరిసిల్లకే పరిమితం కాలేదా?

వార్ రూంలో పనిచేసిన సభ్యులు కేవలం సిరిసిల్లకు మాత్రమే పరిమితం కాలేదని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా పెద్దపల్లిలో ముగ్గురు కీలక ప్రతిపక్ష నేతల అనుచరులకు చెందిన కోట్లాది రూపాయలను అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలీసులు ఉమ్మడి జిల్లాతోపాటు, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పట్టుకున్నారు. కరీంనగర్, జగిత్యాల ప్రతిపక్ష నేతలు డబ్బులు ఖర్చు చేయకుండా వారికున్న ఆర్థిక మూలాలను ముందే గుర్తించి, కట్టడి చేశారన్న దిశగానూ దర్యాప్తు సాగుతోంది. సూట్‌కేసు పరిమాణంలో ఉండే ట్యాపింగ్ పరికరాలను ఓ వ్యాన్‌లో పెట్టుకొని, టార్గెట్ చేసిన నాయకుడి ఇంటికి 200 మీటర్ల దూరంలో ఉంటే చాలు.. ఆయన కాల్స్ మాత్రమే కాదు, ఇంట్లోవారు, ఆ చుట్టుపక్కల వారి కాల్స్ కూడా వినే వీలుంటుంది.

2022లోనే అనుమానించిన ఎంపీ సంజయ్

2022 మే 25వ తేదీన అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌లోని ఓ ప్రధాన మీడియా సంస్థ విలేకరితో హిందూ ఏక్తా యాత్రపై చర్చించారు. ఆ ఫోన్ కట్ అయిన కొన్ని నిమిషాల్లోనే ఎంపీ నివాసాన్ని పోలీసులు చుట్టుముట్టారు. దీంతో ఆయన అనుచరులు సదరు విలేకరే పోలీసులకు సమాచారం ఇచ్చాడంటూ వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనతోపాటు మరిన్ని సంఘటనలు గుర్తు చేసుకున్న ఎంపీ సంజయ్ తనతోపాటు తన అనుచరుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అనుమానించారు.

నీటి సరఫరా సమృద్ధిగా జరగాలి

- మిషన్ భగీరథకు ప్రత్యామ్నాయ నీటి వనరులు ఉండాలి..
- అత్యవసర పనులను చేపట్టాలి..
- జిల్లాలో నీటి సరఫరాలపై కలెక్టర్ సమీక్ష..



సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో నీటి సరఫరాపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో నీటి ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. మిషన్ భగీరథకు ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలని, వాటికి అవసరమైన మరమ్మతులు చేయాలని కలెక్టర్ సూచించారు. స్థానికంగా ఉన్న నీటివనరులు, బోరు బావులను గుర్తించాలన్నారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, వేములవాడ అర్బన్, వేములవాడరూరల్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల వారీగా తాగునీటి సరఫరా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లోనూ చివరి నివాస ప్రాంతం వరకు నీటి చేరేలా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. నీటి ఇబ్బందులు రాకుండా పక్కా ప్రణాళికతో పనిచేయాలని అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జెడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, మిషన్ భగీరథ ఈఈలు, జానకి, విజయ్, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఆర్.డబ్ల్యూఎస్., పబ్లిక్ హెల్త్ ఈ.ఈలు, ఎంపీడీవోలు, డీఈఈ, పంచాయతీ అధికారులు, ఎంపీవోలు, ఏఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేయాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): సరైన ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. జిల్లా సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అదనపు కలెక్టర్ గౌతమితో కలిసి తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ భూపతి ఉన్నారు.

కేసుల్లో శిక్షల శాతం పెంచాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లక్రైం: నేరాలు చేసిన వారికి శిక్ష పడితేనే పోలీసులపై ప్రజల్లో నమ్మకం కలుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరణ, కేసు నమోదు, విచారణ, చార్జిషీట్ దాఖలు వరకు తీసుకునే చర్యలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ వివరించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. నాణ్యమైన విచారణతోనే కేసులు కొలిక్కి వస్తాయన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో, నాన్ గ్రేవ్, క్రైమ్, మహిళకు సంబంధించిన కేసులు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల కేసులలో పక్కా ప్రొసీజర్ పాటించాలని సూచించారు. ట్రెయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, సీఐలు రఘుపతి, సదన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సీఐ అనిల్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఎమ్మెల్యే కేటీఆర్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్/తంగళ్లపల్లి: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సెక్యులర్ భావాలున్న సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. కష్ట సమయంలో ప్రజల ఆదరణతో తిరిగి మంచి రోజులు తీసుకొస్తామన్నారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లోని షాదీఖానాలో గురువారం జరిగిన ఇఫ్తార్ విందుకు హాజరై మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధిని సమతూకంలో నిర్వహించిన పాలన నుంచి మార్పు పేరిట సంక్షోభాన్ని తెచ్చుకున్నట్లయిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, గూడూరి ప్రవీణ్, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ సలీం, సత్తార్ పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో పంటనష్టాన్ని ఎమ్మెల్యే కేటీఆర్ పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. ఎంపీపీ పడిగెల మానస, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, స్థానిక ఎంపీటీసీ గుగ్గిళ్ల లావణ్య, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

సిరిసిల్ల బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని కేటీఆర్ అభినందించారు. అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

శుభకార్యాలు..పార్టీ కార్యకలాపాల్లో సందడి

ఎమ్మెల్యే కేటీఆర్ గురువారం బిజీగా గడిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్–రేణుక దంపతుల తనయుడు నిఖిల్–అనూష పెళ్లికి హాజరయ్యారు. గరుదాస్ మహేశ్–మోక్ష, బల్యాల శ్రీకాంత్–హారిక, మరో నాయకుడు కర్తెల నరేశ్ వివాహానికి, అక్కెనపల్లి రాజయ్య–లక్ష్మి కుమారుడు వివాహానికి హాజరయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న మూడం సాయికుమార్‌ను పలకరించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


‘పది’ పరీక్షకు 6,470 మంది హాజరు

సిరిసిల్లఎడ్యుకేషన్: పదోతరగతి పరీక్షల్లో 6,470 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. గురువారం బయోలజీ పరీక్ష నిర్వహించామని ఈ పరీక్షకు 6,475 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రైవేటులో ఐదుగురికి ఒకరు గైర్హాజరైనట్లు వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎండాకాలం దృష్ట్యా అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

బార్ అసోసియేషన్ కార్యవర్గాలు

- సిరిసిల్ల అధ్యక్షుడిగా సంజీవరెడ్డి
- వేములవాడ అధ్యక్షుడిగా సదానందం



సంజీవరెడ్డి

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దోర్నాల సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. 18 ఓట్ల మెజార్టీతో గెలిచినట్లు ఎన్నికల అధికారి సురభి సత్యనారాయణ తెలిపారు. తన సమీప ప్రత్యర్థి శ్రీనివాసరావుకు 50 ఓట్లు రాగా సంజీవరెడ్డికి 68 ఓట్లు వచ్చాయి. కార్యదర్శిగా తంగళ్లపల్లి వెంకట్, జాయింట్ సెక్రెటరీగా నాగరాజుగౌడ్, కోశాధికారిగా బిట్ల విష్ణు, స్పోర్ట్స్ సెక్రటరీగా గుడ్ల కిషన్, లైబ్రరీ సెక్రెటరీగా గుండెల్లి శశాంక్ ఎంపికయ్యారు.

వేములవాడ అసోసియేషన్..



గుడిసె సదానందం

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గుడిసె సదానందం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి విద్యాసాగర్ రావు గురువారం ప్రకటించారు. మొత్తం 103 ఓట్లకు 98 మంది అడ్వకేట్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా గుడిసె సదానందం, ఉపాధ్యక్షుడిగా ప్రతాప సంతోష్, ప్రధాన కార్యదర్శిగా అవదూత రజనీకాంత్, సహాయ కార్యదర్శిగా గొంటి శంకర్, లైబ్రరీ సెక్రెటరీగా గుజ్జ మనోహర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా నాగుల సంపత్‌కుమార్, కోశాధికారిగా బొడ్డు ప్రశాంత్, సీనియర్ ఈసీ మెంబర్లుగా ఎం.సుజాత, పంపరి శంకరయ్య, జె.శేఖర్, జూనియర్ ఈసీ మెంబర్లుగా నవీన్, రాకేశ్, వంశీకృష్ణ, లేడీ రిప్రజెంటేటీవ్‌గా అన్నపూర్ణ ఎన్నికైనట్లు ప్రకటించారు.

పాతాళంలో గంగ

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- గత నెల కంటే 1.63 మీటర్ల లోతుకు..
- వీర్నపల్లిలో అత్యధికంగా 26.84 మీటర్లు
- వేములవాడరూరల్‌లో 6.07 మీటర్లు..
- జిల్లా భూగర్భ జల అధికారి నర్సింహులు



కొద్దిగా నీరు పోస్తున్న బోరు

సిరిసిల్ల: జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. జిల్లాలో 2023తో పోల్చితే.. భూగర్భంలో నీటిమట్టం మరింత లోతుకు పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా మార్చి నెలలో తీసిన భూగర్భ జలమట్టాలను జిల్లా భూగర్భ జల అధికారి నర్సింహులు గురువారం వెల్లడించారు. జిల్లాలోని వీర్నపల్లి మండలంలో అత్యధికంగా 26.84 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం చేరింది. అదే వేములవాడ రూరల్ మండలంలో 6.07 మీటర్లలోనే నీటినిల్వలు ఉన్నాయి. 2023 మే నెలతో పోల్చితే... జిల్లాలోని అన్ని మండలాల్లో 2024 మార్చిలోనే సగటున 3.47 మీటర్ల లోతులోకి నీటి మట్టం పడిపోయాయి. ఇంకా వేసవి కాలం ఏప్రిల్, మే నెలలు మిగిలి ఉండడంతో జిల్లాలో మరింత లోతుకు భూగర్భ జలాలు చేరే ప్రమాదం ఉంది. కారణాలు ఏమైనా..జిల్లాలో నీటి మట్టాలు అన్ని ప్రాంతాల్లో పాతాళానికి చేరాయి.

ప్రమాద ఘంటికలు..

గతేడాది మేలో ఉండాల్సిన దాని కంటే.. ఎక్కువ లోతుకు ఇప్పుడు మార్చి నెలలోనే పడిపోవడంతో జిల్లాలో ప్రమాద ఘంటికలు మోగనున్నాయని స్పష్టమవుతుంది. సాధారణంగా భూగర్భ జలాలు మే నెలలో పాతాళానికి చేరుతాయి. కానీ ఈ ఏడాది మార్చిలోనే మే నెల కంటే ఎక్కువ లోతుకు పడిపోవడం దారుణం. ఇప్పటికే బోర్లలో నీరు అడుగంటిపోయాయి. ఎంతో బాగా నీరు ఇచ్చే బోర్లు ఎత్తిపోయాయి. మధ్యమానేరు జలాశయంలో నీరు అడుగంటిపోయింది. ఎగువ మానేరు, నిమ్మపల్లి మూలవాగు, అనంతగిరి అన్నపూర్ణ, జిల్లెల్ల నక్కవాగు, ఫాజుల్‌నగర్ రిజర్వాయర్, మల్కపేట రిజర్వాయర్‌లో నీటి మట్టాలు అడుగంటాయి. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా శరవేగంగా నీటి ఊటలు పాతాళానికి చేరాయి. ఇప్పటికైనా నీటి పొదుపు పాటించి భూగర్భ జలాలను సంరక్షించాల్సిన అవసరం ఉంది. లేకుంటే.. జిల్లాలో నీటి కరువు తీవ్రతరం కానుంది.

నీటి వాడకం పెరిగింది



జిల్లాలో వరి పంటను ఎక్కువ వేయడంతో నీటి వాడకం పెరిగింది. పదేళ్ల భూగర్భ జలాల మట్టాలను పరిశీలిస్తే 70 సెంటిమీటర్లు నీటిమట్టం పెరిగింది. కానీ గత మూడేళ్ల ట్రెండ్‌ను పరిశీలిస్తే 60 సెంటీమీటర్ల నీటి మట్టం తగ్గింది. వర్షాలు పడిన దాన్ని బట్టి ఇది మారుతుంది. 2022లో 40 శాతం అదనపు వర్షం పడితే.. 2023లో 20 శాతం వర్షం అదనంగా పడింది. సాగు విస్తీర్ణం పెరగడంతో ఈ ఏడాది నీటి మట్టం పడిపోయింది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే.. మళ్లీ పెరిగే అవకాశం ఉంటుంది.

– నర్సింహులు, జిల్లా భూగర్భ జల అధికారి

భూగర్భ జలాల తీరు (మీటర్లు.. లోతులో)

మండలం	2023 మే	2024 మార్చి
బోయినపల్లి	5.69	7.52
చందుర్తి	5.52	8.46
గంభీరావుపేట	8.98	10.70
ఇల్లంతకుంట	6.94	9.0
కోనరావుపేట	9.30	11.41
ముస్తాబాద్	4.77	13.48
రుద్రంగి	4.73	9.19
సిరిసిల్ల	12.34	13.19
తంగళ్లపల్లి	6.65	10.37
వీర్నపల్లి	12.72	26.84
వేములవాడ రూరల్	4.78	6.07
వేములవాడ అర్బన్	10.32	15.20
ఎల్లారెడ్డిపేట	7.60	16.68
జిల్లా సగటు	8.33	11.81

కొనుగోలు కేంద్రాల్లో ఐరిష్ నమోదు



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

- కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి
- కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి
- వడ్లు క్వింటాలుకు ఏ–గ్రేడ్ రూ.2,203
- కామన్ రకానికి రూ.2,183
- ఏప్రిల్ 1న మండలానికో కేంద్రం
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఐరిష్‌ను రికార్డు చేసేందుకు యంత్రాలను ఏర్పాటు చేస్తామని, తూకంలో పారదర్శకత ఉండాలని, నిర్దేశిత బరువు మాత్రమే ఉండాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో రబీ(యాసంగి) సీజన్ ధాన్యం కొనుగోళ్లపై జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, కొనుగోలు కేంద్రాలను అధికారులు, ఆయా శాఖల బాధ్యులు మాత్రమే ప్రారంభించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు, విద్యుత్ వసతి కల్పించాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 చెల్లిస్తుందని తెలిపారు.

ఏప్రిల్ 1న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రబీ సీజన్ కోతలు మొదలైనందున జిల్లాలోని 13 మండలాల్లో ఏప్రిల్ 1వ తేదీన ఒక్కో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో 3 లక్షల నుంచి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 201, ఐకేపీ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ పరిధిలో 10, మెప్మాలో 4 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఐరిష్ యంత్రాలతో ఐరిష్ రికార్డు చేయడం ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత ఉంటుందని స్పష్టం చేశారు. కేటాయించిన రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని కోరారు. జిల్లాలో టార్పాలిన్లు 8,454, తూకం వేసే యంత్రాలు 265, ప్యాడీ క్లీనర్లు 613, తేమ శాతం చూసే మెషిన్లు 570 అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. డీసీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, డీఆర్డీవో శేషాద్రి, డీటీవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

‘సెస్’ను కాపాడండి

- మంత్రి తుమ్మలకు వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వేములవాడ: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)ను వినియోగదారుల కోసం కాపాడాలని, ఈ సంస్థను ప్రభుత్వం బలోపేతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి విన్నవించారు. హైదరాబాద్‌లో గురువారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. సెస్‌లో 2,97,708 సభ్యులతో, 2,55,830 కనెక్షన్లతో, సభ్యుల వాటా ధనం రూ.6,14,81,587లతో వినియోగదారులకు సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఫిబ్రవరిలో సెస్‌ను మూసివేయాలని ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేయాలన్న ప్రతిపాదనను ఈఆర్‌సీ ప్రభుత్వానికి నివేదించిందని వివరించారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా కృషి చేయాలని కోరారు.

రాష్ట్రాన్ని దోచుకుంది మీరు కాదా?

- కృత్రిమ కరువు సృష్టిస్తుంది బీఆర్ఎస్ వాళ్లే
- అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారు
- కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: కేటీఆర్ మాటలు వింటుంటే అధికారం కోల్పోయి, మతిభ్రమించి నోటికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు. వేములవాడలో గురువారం విలేకరులతో మాట్లాడారు. లిక్కర్ స్కామ్‌లో కేటీఆర్ సోదరి కవిత, ఫోర్జరీ కేసులో సంతోష్‌రావు, ఫోన్‌ట్యాపింగ్‌లో బావబామ్మర్దుల పాత్రపై కథనాలు వస్తుండడంతో ఇలా మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. కేటీఆర్ సిరిసిల్ల పర్యటనలో చేసిన వ్యాఖ్యలను ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం చలికాలంలో ఏర్పడిందని, ఎండాకాలంలో వర్షాలు పడడం లేదన్న వాదనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కృత్రిమ కరువు బీఆర్ఎస్ వారే సృష్టిస్తున్నారన్నారు. ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోగానే 10 టీఎంసీల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టింది మీరు కాదా.. అని ప్రశ్నించారు. గత పాలకులకు ముందుచూపు లేకపోవడంతో కృష్ణజలాలను పక్క రాష్ట్రం వారికి అప్పజెప్పారన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. ఎన్నికల గ్యారంటీ హామీలు అమలు చేస్తున్నామన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగారం వెంకటస్వామి, సంగ స్వామి, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, కూర దేవయ్య, పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో కిక్కిరిసిన భక్తులు



వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం జరిగిన శివకల్యాణోత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణ వేడుకల అనంతరం స్వగ్రామాలకు వెనుదిరిగిన భక్తులతో వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులను నడిపించినట్లు వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు.



అతివేగం.. ప్రమాదకరం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. ఒకదాని వెనుక ఒకటి అతివేగంగా వెళ్తుండడంతో రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు రోడ్డు కనిపించకపోగా.. సైడ్ నుంచి వెళ్లే అవకాశం కూడా ఉండడం లేదు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండడంతో జరిగిన ప్రమాదాలు పలువురు మృతిచెందగా.. అనేక మంది గాయపడ్డారు. పోలీసులు ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లపై దృష్టి పెట్టి, అతివేగంగా వెళ్లకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

చేయి విరిగినా.. ‘పది’ పరీక్షకు హాజరు



సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మహ్విన్ నిసార్‌కు ప్రమాదవశాత్తు కుడి చేతు విరిగింది. స్థానిక కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కేంద్రానికి పరీక్ష రాసేందుకు వచ్చింది. కుడి చేతు విరగడంతో సహాయకురాలిగా పరీక్షలు రాయడానికి తన కంటే కింద తరగతి విద్యార్థినితో వచ్చింది.

పాఠశాల కిటికీకి నిప్పంటించిన దుండగులు



కరీంనగర్‌రూరల్: దుర్శేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిటికీకి గురువారం సాయంత్రం దుండగులు నిప్పంటించడంతో పాక్షికంగా కాలిపోయింది. వారం రోజుల క్రితం స్కూల్లోని సీలింగ్ ఫ్యాన్లు, కరెంటు స్విచ్ బోర్డులు, డిజిటల్ బోర్డును కొందరు విద్యార్థులు ధ్వంసం చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు రాస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పదోతరగతి పరీక్ష కేంద్రానికి భద్రత కల్పించాలని కోరుతున్నారు.

దాడి కేసులో ఒకరికి జైలు

మంథని: మండలంలోని భట్టుపల్లికి చెందిన దూపం శ్రీనివాస్‌పై గొడ్డలితో దాడి చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన గుండ్ల సదయ్యకు మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి జైలుశిక్ష, జరిమానా విధించారు. 11.05.2023న శ్రీనివాస్‌పై సదయ్య గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. చంపాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశాడని బాధితుడి భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తి చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి గురువారం సదయ్యకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లిమిటెడ్‌తోపాటు ఐవోసీఎల్, ఇతర గ్యాస్ ఆధారిత పరిశ్రమలకు జీఏస్‌పీఎల్ ఇండియా ట్రాన్స్‌కో లిమిటెడ్, కుందనపల్లి నుంచి రామగుండం వరకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తోంది. అయితే, గ్యాస్ సరఫరా సమయంలో లీకేజీ సమస్య ఏర్పడితే స్పందించడం, నియంత్రణ చర్యలు తీసుకోవడం తదితర చర్యలపై రెస్క్యూ సభ్యులు గురువారం ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించారు. పైప్‌లైన్‌లో గ్యాస్ లీకేజీ, ఎగిసిన మంటలను అదుపు చేయడం, గాయాల పాలైన వారిని ఆస్పత్రికి తరలించడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, రామగుండం కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జీఐటీఎల్ అధికారులు ఎంకే తుతేజ, రాగేశ్, నవీన్‌పటేల్, ఆనంద్, రుషబ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్లాలి
- వీర్నపల్లిలో కలెక్టర్ అనురాగ్ జయంతి



కంపోస్ట్‌షెడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు

వీర్నపల్లి(సిరిసిల్ల): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. అదనపు కలెక్టర్ గౌతమితో కలిసి వీర్నపల్లి మండల కేంద్రంలో గురువారం పర్యటించి పలు సూచనలు చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఇంట్రా పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి సరఫరా కోసం గ్రామ పంచాయతీల వద్ద ఉన్న నిధులను వినియోగించుకోవాలన్నారు. నీటి వృథాను అరికట్టాలని, లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. అవకాశం ఉన్నచోట హ్యాండ్‌పంపులు, నీటి సరఫరా మోటార్లను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. అనంతరం వాటర్ ట్యాంకులను, కంపోస్ట్‌షెడ్లను పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, మిషన్ భగీరథ ఈఈలు విజయ్, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్‌కుమార్, ఎండీవో నరేశ్‌కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ‘చాడ’ లేఖ

సిరిసిల్లటౌన్: చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని చేనేత, సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను వివరిస్తూ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ కాలంలో సిరిసిల్లలో బతుకమ్మ చీరలను తయారు చేయించగా వాటికి సంబంధించిన రూ.270కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నేత కార్మికులకు యారన్ సబ్సిడీ డబ్బులు ఇవ్వాలని కోరారు. మూడు నెలలుగా సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని, ఆదుకోవాలని కోరారు. గత 45 రోజులుగా కార్మికులు, ఆసాములు పోరాటాలు చేస్తున్నారని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేతకు చేయూత పథకానికి నిధులు మంజూరు చేయాలని, త్రిఫ్ట్ పథకానికి ఇవ్వాల్సిన డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మీర్జంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందగా ఆమె మనవడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఓదెల మండలంలోని గుంపుల గ్రామానికి చెందిన తిప్పారపు ఓదమ్మ(75) గురువారం తన మనవడు విఘ్నేశ్‌తో కలిసి బైక్‌పై మీర్జంపేటలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైంది. తిరిగి స్వగ్రామం వస్తుండగా ఓ కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓదమ్మ అక్కడికక్కడే మృతిచెందగా విఘ్నేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు.

ఆర్టీసీ బస్సులో వృద్ధుడి మృతి

మెట్‌పల్లి(కోరుట్ల): ఆర్టీసీ బస్సులో ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్‌కు చెందిన బోగం సామయ్య(70) హుజూరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఆర్టీసీ బస్సులో నిజామాబాద్ వస్తున్నాడు. మెట్‌పల్లి శివారులోకి రాగానే తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. డ్రైవర్ బస్సును నిలిపివేసి, 108కు సమాచారమిచ్చారు. సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని, బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు.

నర్సింగపూర్‌లో చోరీ

- 10 తులాల పట్టగొలుసులు మాయం

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం నర్సింగపూర్‌కు చెందిన బైరగోని మల్లేశం ఇంట్లో దొంగతనం జరిగిందని గురువారం బాధితుడు చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత బైరగోని సునిత మల్లేశం దంపతులు వేములవాడలో నివాసం ఉంటున్నారు. గురువారం తమ స్వగ్రామం నర్సింగపూర్‌కు వెళ్లారు. ఇంటి తాళం పగులగొట్టి దొంగలు చొరబడి.. 10 తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. చందుర్తి పోలీసులు క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. వేలిముద్రల ఆధారంగా దొంగను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.